www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తిరుపతిలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణం ఆహ్లాదాన్ని పంచింది. మబ్బులు ముసురుకుని అరగంట పాటు వాన కురిసింది. వాన వెలిశాక ఆకాశాన రంగురంగుల ఇంద్రధనస్సు ఏర్పడి నగర వాసులకు కనువిందు చేసింది. తూర్పుదిశలో సాయంత్రం 6.05 గంటల నుంచి ఈ హరివిల్లు కొద్దిసేపు మానసికోల్లాసాన్ని పంచింది. తిరు నగరిలో శ్రీనివాస సేతుపైనుంచి ఈ రంగుల సోయగం కెమెరాలో బంధీ అయిందిలా..

- తిరుపతి అర్బన్



సోమవారం | 10-6-2024
Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పులికాట్‌కు జలకళ

● సరస్సులో పక్షుల కేరింతలు



సూళ్లూరుపేట, జూన్ 9: నిన్నమొన్నటి వరకు చుక్కనీరు లేక నెర్రెలు బారిన పులికాట్ సరస్సు నేడు జలకళను సంతరించుకుంది. వారం రోజుల నుంచి వాతావరణం చల్లబడి ఇటీవల కురిసిన వర్షాలకు సరస్సుకు భారీగా నీరు చేరింది. దీనికి తోడు ఆటుపోట్లకు బంగాళాఖాతం నుంచి సముద్రపు నీరు చేరడంతో సరస్సు నిండుకుండను తలపిస్తోంది. పులికాట్‌లో నీరులేక ఆహారం కోసం అలమటిస్తున్న విదేశీ విహంగాలు సరస్సుకు జలకళ సంతరించడంతో కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప సమీపంలోని సరస్సులో పక్షులు కేరింతలు కొడుతున్నాయి. అదేవిధంగా వేనాడుకు వెళ్లే మార్గంలో కూడా పక్షులు సందడి చేస్తున్నాయి. జాలర్లు కూడా చేపలు వేట సాగిస్తున్నారు.


అతిసారతో బాలిక మృతి



పుత్తూరు, జూన్ 9: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడలో అతిసార వ్యాధితో భవ్య(12) అనే బాలిక ఆదివారం మరణించింది. ఆ పంచాయతీలో నాలుగు రోజుల కిందట రాజగోపాల్ ఆచారి మృతి చెందిన విషయం తెలిసిందే. పది రోజులుగా ఈ పంచాయతీలోని జనం.. వాంతులు, విరేచనాల బారినపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ ప్రాంతాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పర్యటించి.. సహాయ చర్యలను చేపట్టారు. తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించారు. ఈ శిబిరం సోమవారం కూడా కొనసాగిస్తామని తెలిపారు. దాదాపు 25 ఏళ్ల నాటి ఇంటి కొళాయి లైన్లను తీసి వేసి.. కొత్తవి అమర్చుతున్నారు. తాగు నీటిని కూడా రైతుల పొలం నుంచి తీసుకుని సరఫరా చేస్తున్నారు. తాత్కాలికంగా ప్రతి ఇంటికీ రెండు క్యాన్ల మినరల్ వాటర్ అందించారు. వాటర్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపామని కమిషనర్ పేర్కొన్నారు.



దళితవాడలో సహాయక చర్యలు చేపట్టిన అధికారులు - భవ్య (ఫైల్ ఫొటో)



పతనమవుతున్న వెనామీ రొయ్య ధర



కోట, జూన్ 9: వెనామీ రొయ్యల ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోయాయంటూ బయ్యర్లు ప్రచారం చేస్తూ.. కారుచౌకగా ఆక్వా రైతుల నుంచి రొయ్యలను తన్నుకుని పోతున్నారన్న విమర్శలొస్తున్నాయి. సముద్ర తీరప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరులో రైతులు వెనామీ రొయ్యలను సాగులో పెట్టి ఉన్నారు. తైవాన్, ఇండోనేషియా, అమెరికాలో 20 రోజుల నుంచి రొయ్యల ధరలు పడిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో 100 కౌంట్ రొయ్యలు రూ.200, 90 కౌంట్ రూ.210, 80 కౌంట్ రూ.220, 70 కౌంట్ రూ.240, 60 కౌంట్ రూ.260, 50 కౌంట్ రూ.280, 40 కౌంట్ రొయ్యల ధరలు రూ.400 నుంచి రూ.300కు పడిపోయాయి. 30 కౌంట్ రొయ్యలైతే రూ.510 నుంచి రూ.430 వరకు పడిపోవడంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు సమీప మార్కెట్లలో ఆశించినంత ధరలు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో బయ్యర్లు అడిగిన రేటుకే రొయ్యలను విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా

● దివ్యాంగుల కేటగిరీలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన జ్యోష్మిత

● జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థిని ప్రతిభ



తిరుపతి(విద్య), జూన్ 9: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఆదివారం విడుదల జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తిరుపతి నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని గుండా జ్యోష్మిత ప్రతిభ చూపారు. దివ్యాంగుల కేటగిరీలో ఆలిండియా ఫస్ట్‌ర్యాంకు సాధించారు. ఆమె మాట్లాడుతూ.. తమది తిరుపతి సమీపంలోని కరకంబాడి ప్రాంతమని, తల్లిదండ్రులు సుమలత, శ్రీనివాస్ కిరాయి దుకాణం నడుపుతుంటారని చెప్పారు. చెన్నై ఐఐటీలో కంప్యూటర్స్ ఇంజనీరింగ్ చదివి, పేరున్న సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

మద్యం మత్తులో గొడవ

కత్తిపోటుతో యువకుడి దుర్మరణం



విజయ్‌కుమార్ మృతదేహం

వెంకటగిరి, జూన్ 9: మద్యం మత్తులో జరిగిన గొడవలో కత్తిపోటుకు గురై ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన వెంకటగిరిలో జరిగింది. సీఐ సంఘమేశ్వర రావు తెలిపిన వివరాల మేరకు.. వెంకటగిరి పట్టణం బొప్పాపురం సాలి కాలనీకి చెందిన బొక్కిసం విజయ్‌కుమార్(35) అమరరాజా కంపెనీ ఉద్యోగి. ఆదివారం కావడంతో పట్టణంలోని పాల కేంద్రం సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న పినాకినీ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగుతున్నాడు. ఈ సందర్భంగా ఈ బార్‌ను ఆనుకుని ఉన్న కూల్ డ్రింక్ షాపులో పనిచేసే శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామానికి చెందిన నరసింహులుతో వివాదం తలెత్తింది. ఇద్దరూ మద్యం మత్తులో ఉండటంతో మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈక్రమంలో నరసింహులు తన వద్ద ఉన్న కత్తితో విజయ్‌కుమార్ చాతీపై పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బిత్తరపోయిన నరసింహులు అక్కడినుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు క్వాలిటీ మొక్కలు అందిస్తాం




బయోట్రిమ్ సిల్వి కల్చరిస్ట్ యశోదబాయి

మంగళం, జూన్ 9: తక్కువ సమయంలో ఆదాయం వచ్చేలా క్వాలిటీ ఉన్న మొక్కలను రైతులకు అందిస్తామని తిరుపతిలోని బయోట్రిమ్ సిల్వి కల్చరిస్ట్ యశోదబాయి తెలిపారు. ఈ మొక్కలను క్వాలిటీ గల మదర్ ట్రీ ద్వారా ల్యాబ్‌లో డెవలప్ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే దాదాపు 50వేల ఎర్రచందనం మొక్కలను రైతులకు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నామని, వీటితోపాటు టేకు, వెలగ, అడవి నేరేడు, బిల్వ మొక్కలను డెవలప్ చేస్తున్నామన్నారు. అలాగే గార్డెన్లలో పెంచుకునే మొక్కలతోపాటు దాదాపు పదిరకాల మొక్కలు సిద్ధం అవుతున్నాయన్నారు. బయోట్రిమ్‌కు కొత్తగా మూడు ఆటోక్లేవ్స్ పరికరాలు తెప్పించామన్నారు. వీటితోపాటు ల్యాబ్‌కు సంబంధించిన కొన్ని పరికరాలు వచ్చాయన్నారు. దాదాపు రూ.10లక్షలతో వీటిని తెప్పించినట్లు పేర్కొన్నారు. మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించినట్లు తెలిపారు.



ఆటో క్లేవ్స్ పరికరాలు





టీడీపీ అధికారంలోకి రావడం.. నారా లోకేశ్ భారీ మెజారిటీతో గెలవడంతో ఆదివారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకుడు కొల్లూరి ఇందుశేఖర్

ఘనంగా భక్తాంజనేయస్వామి పుష్పాభిషేకం



చంద్రగిరి, జూన్ 9: హనుమత్ జయంతి పురస్కరించుకుని శ్రీవారి మెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి స్వామిని విశేషంగా అలంకరించారు. ఒకటిన్నర టన్నుల పుష్పాలతో స్వామివారికి పుష్పాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పుష్పాలు సమర్పించారు. మధ్యాహ్నం సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. భక్తాంజనేయస్వామి భక్త బృందం పాల్గొన్నారు.

98-డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం

● నానీకి ఉపాధ్యాయుల వినతి



నానీని సన్మానిస్తున్న నోబుల్ అసోసియేషన్ టీచర్లు

చంద్రగిరి, జూన్ 9: ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నానీని ఆదివారం ఎంటీఎస్ ఉపాధ్యాయులు కలిశారు. వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ 1998-డీఎస్సీలో అర్హత సాధించి, గతేడాది విధుల్లో చేరిన తాము 25 సంవత్సరాల సర్వీసు కోల్పోయామన్నారు. సర్వీసును రెగ్యులరైజేషన్ చేయాలని, రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, 12 నెలల వేతనం ఇప్పించాలని, కనీస పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని నాని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు నాగరాజు, రమేష్, చంద్రశేఖర్, గోవిందరాజు, నాగార్జున, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డిరమేష్‌బాబు, సురేష్‌కుమార్ తదితరులు కూడా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దు చేయాలని, త్వరగా డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కరిస్తామని నాని వారికి హామీ ఇచ్చారు.

ఎ.రంగంపేటలో రామోజీరావుకు ఘన నివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జూన్ 9: ఎ.రంగంపేటలో ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావుకు టీడీపీ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ రామోజీరావు ఎంతోమందికి ఉపాధి కల్పించారన్నారు. అన్నదాత ద్వారా రైతులకు సేవలందించారన్నారు. ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశానికి తీరని లోటు అన్నారు. టీడీపీ నాయకులు గుడిమల్లం చెంగల్రాయాచారి, దేవిలాల్, నాగిరెడ్డి, భూపతి, పళణి, పచ్చిపాల కిషోర్, కలివేటి చంద్రమౌళి, ఎంసీ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



మృతిచెందిన విద్యార్థి బన్ని(22)

పాకాల, జూన్ 9: పాకాల మండల పరిధిలో చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిలో పెరుమాళ్ల గుడిపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన బన్ని (22) చిత్తూరు ఎస్వీ సెట్‌లో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై చౌడేపల్లె వెళ్తూ పెరుమాళ్ల గుడిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న సుమోను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పాకాల ఎస్సై మహేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారిసేవలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే

తిరుచానూరు, జూన్ 9: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూన్ 9: పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలుపొందడంతో టీడీపీ జిల్లా కార్యదర్శి కె.హరిప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవ స్కూటర్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి 300 స్కూటర్లలో బాదూరు, తాటిమాకులకండ్రిగ,రామానాయుడుకండ్రిగ,కొత్తకండ్రిగ,మిట్టకండ్రిగ మీదుగా పరమాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. భారీగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి కె.హరిప్రసాద్‌నాయుడు, మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, సురేంద్రనాయుడు, దినేష్‌నాయుడు, తులసీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నానీకి సుగుణమ్మ అభినందనలు



నానికి శుభాకాంక్షలు తెలుపుతున్న సుగుణమ్మ

తిరుచానూరు, జూన్ 9: చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నానీని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆదివారం కలిశారు. ఘనవిజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

అలరించిన నృత్యప్రదర్శన

తిరుచానూరు, జూన్ 9: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వేసవి సెలవులు, వారాంతం పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీనృత్యాంజలి కల్చరల్ డాన్స్ సంస్థ కళా బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన అలరించింది. అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు, ఆంధ్ర జానపద నృత్యాలు, కూచిపూడి తదితర అంశాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన భవ్యశ్రీ బృందం, దివ్యపాలక్ష్, శృతిశంకర్ బృందం, నటరాజ నాట్యాలయ, బ్లూమింగ్‌డేల్ నాట్యాలయం, లలితాంబిక నృత్యాలయం ప్రదర్శించిన నృత్యాలు మన్ననలందుకున్నాయి. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి సన్మానించారు.

దామలచెరువులో టీడీపీ సంబరాలు



విజయోత్సవంలో టీడీపీ శ్రేణులు

పాకాల, జూన్ 9: పులివర్తి నాని ఎమ్మెల్యేగా విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ దామలచెరువు టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కుక్కలపల్లె రైల్వే గేటు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అనందరం మ్యాంగోనగర్ మీదుగా దామలచెరువు హైస్కూల్ గేటు మీదుగా ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి రంగులు చల్లుకున్నారు. పార్టీ జెండాలతో కేరింతలు కొట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









తిరుపతి నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచింది. పగలు కాసిన ఎండ నుంచి ఉపశమనం పొందారు. కొన్నిచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. ఇళ్లకు చేరడానికి జనం అవస్థలు పడ్డారు. వర్షానికి ముందు బలమైన గాలులు వీచాయి.

'హే సిరి అలా వెళ్లకే' సినిమా షూటింగ్ ప్రారంభం

తిరుపతి అర్బన్, జూన్ 9: నగరంలో 'హే సిరి అలా వెళ్లకే' సినిమా షూటింగ్ ఆదివారం ప్రారంభమైంది. షిలోక్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని షీలా లోకనాథన్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా రచయిత భరత్, దర్శకుడు క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఇది ఒక ప్రేమ కథ చిత్రమని చెప్పారు. హీరోగా సాయి, హీరోయిన్‌గా షీలా లోకనాథన్, ఇతర ముఖ్యపాత్రలలో మోనికారాజ్, కామెడిశాస్త్రి, వినుకొండ రవి, సుభాష్ చంద్రబోష్, గుర్రప్ప నాయుడు, భరణికుమార్, బేబీ అభిజ్ఞ, శోధన నటిస్తున్నారన్నారు. జీ9 ఫిలిం ఫ్యాక్టరీ చిత్ర నిర్మాణ సంస్థ సహాయ సహకారాలతో ఈ సినిమాను 32రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతాల్లో పూర్తిచేస్తామన్నారు.



సినిమా షూటింగ్‌కు హాజరైన యువ నటీనటులు



పులివర్తి నానీకి అభినందనలు

బంగారుపాళ్యం, జూన్ 9: చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నానీకి బంగారుపాళ్యానికి చెందిన పారిశ్రామికవేత్త, ఎన్ఆర్ఐ వల్లేరు కల్యాణ్ అభినందనలు తెలిపారు. కుటుంబ సమేతంగా ఆదివారం తన ఇంటికి వచ్చిన నానీకి కల్యాణ్ కుటుంబ సభ్యులు దుశ్శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను సన్మానించారు.

→ నానీని సన్మానిస్తున్న ఎన్ఆర్ఐ కల్యాణ్

శ్రీకాళహస్తిలో గాలివాన

శ్రీకాళహస్తి, జూన్ 9: శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం సాయంత్రం సుమారు గంటపాటు గాలితో కూడిన వర్షం పడింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈదురుగాలులతో పట్టణంలోని ఓ పెట్రోల్‌బంక్ సమీపంలో ఉన్న ఓ చెట్టు కూలిపోయింది. అరగంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌పై విచారణ చేపట్టాలి

తెలుగు యువత డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 9: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలను ప్రైవేట్ యూనివర్సిటీలుగా హేమచంద్రారెడ్డి మార్పు చేశారని తెలిపారు. దీని ద్వారా కోట్లాది రూపాయలు అక్రమంగా దండుకున్నారని ఆరోపించారు. వైస్ చైర్మన్ రామ్మోహనరావు పర్యటనల పేరుతో లక్షలాది రూపాయలు కాజేశారని విమర్శించారు. డొల్ల సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని చెప్పారు. ఉన్నత విద్యా మండలి పరిధిలో రూ.150 కోట్ల మేర అవినీతి జరిగిందని, దీనికి బాధ్యులైన హేమచంద్రారెడ్డిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆనంద్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

డక్కిలి, జూన్ 9 : మెట్ట ప్రాంత రైతుల కలల ప్రాజెక్టు ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణంపై కొత్తప్రభుత్వం ఏర్పడడంతో రైతులు కోటి ఆశలతో ఉన్నారు. వాస్తవానికి గత టీడీపీ హయాంలో రూ.400 కోట్లతో ఈ రిజర్వాయరు నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేయించడంలో అప్పటి ఎమ్మెల్యే రామకృష్ణ ఎంతో కృషి చేశారు. పనులు కూడా 20 శాతం మేర పూర్తయ్యాయి. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రీ టెండర్ల పేరుతో రిజర్వాయరు పనులును అర్ధంతరంగా నిలిపివేసింది. తర్వాత 26 శాతం లెస్‌తో రీ టెండరులో పనులు దక్కించుకున్న కాంట్రాక్టరును కొంతమంది వైసీపీ నాయకులు పనులు ముందుకు సాగనీయకుండా అడ్డుకోవడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతూ వచ్చింది. నిర్మాణానికి అవసరమైన మట్టిని డక్కిలి మండలం వలుగోడు, మోపూరు, బీముడు చెరువుల నుంచి తరలించేందుకు కాంట్రాక్టరు అనుమతులు పొందినా అక్కడి రైతులు అడ్డుకోవడంతో కష్టతరంగా మారింది. దీంతో రిజార్వాయరు నిర్మాణానికి అడుగడునా అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో కాంట్రాక్టరు నష్టాలు చవిచూడాల్సి వస్తుందని పనులను నిలిపివేశాడు. దీంతో గత నాలుగేళ్లగా ఈ రిజర్వాయరు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

జగన్ హామీ ఇచ్చినా ముందుకు సాగని వైనం

ఎన్నికలకు సుమారు ఏడాదికి ముందు నేతన్న నేస్తం బటన్ నొక్కేందుకు ముఖ్యమంత్రి హోదాలో వెంకటగిరికి వచ్చిన జగన్... ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రీ టెండర్లు పిలిచి రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు.

1.70 లక్షల ఎకరాలకు సాగునీరు

ఆల్తూరుపాడు నిర్మాణం పూర్తయయితే ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు, శ్రీకాళహస్తి పట్టణం, తిరుపతి నగరాలకు తాగు నీరు అందుతుంది. కానీ పాలకులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో మొదటి నుంచి నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

● ఇంకో రెండు రోజుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడనుండడంతో ప్రాజెక్టు నిర్మాణంపై కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వెంకటగిరికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే రిజర్వాయరు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈక్రమంలో ప్రాజెక్టు విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కురుగొండ్లను నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అర్ధంతరంగా ఆగిన ఆల్తూరుపాడు రిజర్వాయరు ఎత్తిపోతల పథకం

కల్కి ఆక్రమిత భూములను ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారు?

వరదయ్యపాళెం, జూన్ 9: వరదయ్యపాళెం మండలం బత్తులవల్లం హరిజనవాడలో కల్కి ఆక్రమించుకున్న పేదలకు చెందిన 3.74 ఎకరాల భూములను అధికారులు ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారని ఏపీ హేతువాదసంఘ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల క్రితం బత్తులవల్లం గ్రామంలో పేదలకు చెందిన 3.74 ఎకరాల భూమిని కల్కి అనే బాబా ఆక్రమించి రూ.500 కోట్లతో ఆశ్రమం నిర్మించాడన్నారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ యేడాది జనవరి 10న న్యాయస్థానం రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. భూములను పేదల స్వాధీనం చేయాల్సిన బాధ్యత కలెక్టర్, వరదయ్యపాళెం తహసీల్దారుపై ఉందన్నారు. అయితే వారు ఇంత వరకు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి పేదల భూములను స్వాధీనం చేయడంతో పాటు 16 సంవత్సరాల నుంచి పంట నష్టానికి ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.60లక్షలు కల్కి నుంచి వసూలు చేసి రైతులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తామని హెచ్చరించారు.

దారి కాచి బెదిరించి బైక్‌తో పరారీ

తడ, జూన్ 9: పరిశ్రమలకు విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరిన ఇద్దరిని బెదిరించి వాహనంతో పరారయ్యారు. వరదయపాళ్యం మండలం పులియాలం గ్రామానికి చెందిన ఎం.వరంధాం, రవి అపాచీ పరి శ్రమలో పని చేస్తుంటారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బైక్‌పై ఎన్ఎంకండ్రిగ మీదుగా బయలుదేరారు. మార్గమధ్యంలో మాంబట్టు సెజ్‌లో దట్టమైన చెట్లు ఉన్న ప్రదేశానికి వచ్చేసరికి అక్కడ ముగ్గురు వ్యక్తులు రోడ్డుపై అడ్డంగా నిలబడి బైక్‌ను ఆపారు. బైక్ నడుపుతున్న ఇద్దరిని బెదిరించి వారి వాహనంతో పరారయ్యారు. దీంతో బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లదే హవా

రేణిగుంట, జూన్ 9: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల హవా సాగుతోంది. స్టాంపు డ్యూటీ నిధులు దుర్వినియోగం చేశారన్న కారణంగా సబ్ రిజిస్ట్రార్ శోభారాణిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సస్పెన్షన్ వెనుక అసలు సూత్రధారులు డాక్యుమెంట్ రైటర్లే అని సమాచారం. వైసీపీ ప్రభుత్వ పాలనలో రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు జరిగాయని, భూములను రిజిస్ట్రేషన్ చేయాలంటే వివిధ సర్టిఫికెట్లు కావాలంటూ క్రయవిక్రయాలపై మెళికలు పెట్టేవారని, ఈ క్రమంలో సబ్ రిజిస్ట్రార్‌కు ఇవ్వాలంటూ అంకణానికి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు చాలా కాలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా బ్లాక్‌మనీ కావడంతో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు ఆదాయ పన్ను చెల్లించకుండా కోట్లలో ఆస్తులు కూడపెట్టారని సమాచారం. ఇదిలా ఉండగా గత ఐదేళ్ల కాలంలో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలపై పలుమార్లు ఫిర్యాదులు అందినా ఒక్కసారి కూడా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించకపోవడం గమనార్హం.



ప్రకృతి సేద్యంతో విరగ్గాసిన మామిడి


● అందరికీ ఆదర్శంగా నిలిచిన రైతు మునీశ్వరయ్య దంపతులు

రసాయన ఎరువులు, మందులతో పెట్టుబడి పెరిగి.. నష్టపోయిన రైతులు సుభాష్ పాలేకర్ పద్ధతులను పాటించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రకృతి సేద్యంవైపు అడుగులు వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో గో ఆధారిత సహజ ఎరువులు, వాటి మిశ్రమాలతో కషాయం, నూనెలు తయారు చేసుకుంటూ భూసారాన్ని పెంచుతున్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇలా పులిచెర్ల మండలానికి చెందిన ఓ రైతు దంపతులు ప్రకృతి సేద్యంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వాళ్లే బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ గౌరిశెట్టివారిపల్లెకు చెందిన మునీశ్వరయ్య, కల్పన దంపతులు. ఐదేళ్ల కిందట వీరు మూడు ఎకరాల మామిడి తోటలో ప్రకృతి సేద్యాన్ని మొదలు పెట్టారు. మొదట్లో లాభాలు కనిపించకపోయినా.. వెనకడుగు వేయలేదు. మొదట్లో మూడు ఎకరాల మామిడితోటలో కేవలం మూడు టన్నుల మామిడికాయలు వచ్చేవి. ఇప్పుడు అదే తోటల సుమారు 16 టన్నుల మామిడికాయలు కాస్తున్నాయి. తద్వారా అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. రసాయన ఎరువులు వాడే మామిడిలో ఈ ఏడాది 15శాతం మాత్రమే పంట దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించిన మునీశ్వరయ్య మామిడి తోటలో 70శాతం మేరకు దిగుబడి వచ్చింది. ఇలా.. ప్రకృతి సేద్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని రైతు మునీశ్వరయ్య తెలిపారు. మొదట్లో తనకు లాభాలు రాకపోయినా, ప్రకృతి సేద్యమే మానవాళికి శరణ్యమని భావించి ముందడుగు వేశానని గుర్తుచేసుకున్నారు. అలా, ఓపికగా ఉండబట్టే ఇప్పుడు అధిక లాభాలు చూస్తున్నానని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మరింత లాభాలు పొందవచ్చని అభిప్రాయపడ్డారు.

- కల్లూరు

రైతులూ.. ఇటువైపు మొగ్గు చూపండి

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించగలిగే సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు కోరారు. నాణ్యమైన ఆహారంతో పాటు కాలుష్యం లేని వాతావరణానికి ప్రకృతి సేద్యం ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి వ్యవసాయమే మేలు చేస్తుందన్నారు.



డీపీఎం వాసు



ప్రకృతి సేద్యం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న రైతు మునీశ్వరయ్య, కల్పన దంపతులు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు

తిరుమల, జూన్9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 79,398 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 43,557 మంది తలనీలాలు సమర్పించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతి విద్యార్థుల సత్తా

జాతీయస్థాయిలో పలువురికి అత్యుత్తమ ర్యాంకులు

తిరుపతి(విద్య), జూన్ 9: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆదివారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ సత్తాచాటారు. ప్రతిభచాటిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.

● నారాయణ విద్యార్థుల ప్రభంజనం



స్థానిక నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి విజయప్రభంజనం సృష్టించారని డీజీఎం కొండలరావు పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్‌పీడబ్ల్యూ కేటగిరీల్లో జ్యోష్మిత ఆలిండియా మొదటిర్యాంకుతోపాటు ఓపెన్ కేటగిరీల్లో వివేకానంద 324ర్యాంకు, పుష్కర్ 886, వివస్వత్ 1008, దినేష్ ప్రసాద్ 1366, జస్వంత్ 1892, హితేష్ 2438, ప్రకాశ్ 2617, మైత్రిశ్రీ 3338, ఆదిత్యనివాస్ 6938, బాలాజీ 7151, కిరణ్‌కుమార్ 7480, వెంకటేష్ 8739, నాగశ్వేత 8754, జ్ఞానతేజవర్మ 9024 ర్యాంకులతో సత్తాచాటారని వివరించారు. మొత్తంగా 50మంది విద్యార్థులకు పైగా ఐఐటీసీట్లు సాధించే ర్యాంకులు పొందగా.. వందమందికిపైగా ఎన్ఐటీ, ఐఐటీ సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సురేష్, ఏజీఎం గోపీచంద్, అధ్యాపకులు ఫణీంద్రచౌదరి, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, చిట్టిబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి ఐఐటీ అకాడమీ విద్యార్థుల విజయకేతనం



గోకుల్, జి.నిశ్చల్, టి.మణిదీప్‌రెడ్డి

తిరుపతిలోని అమరావతి ఐఐటీ అకాడమీ(బీవీకేగ్రూప్) విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ పార్థీవ్‌రెడ్డి పేర్కొన్నారు. పి.గోకుల్ 46వర్యాంకు, జి.నిశ్చల్ 662, టి.మణిదీప్‌రెడ్డి 842, కె.ప్రేమజ 1429, షేక్ హఫీఫా 2178, ఆర్.ఆషి 2512, కె.దర్శిని 3559, ఎ.నందీశ్వర్‌రెడ్డి 3780, కె.రుషిత 5603, ఎస్.కారుణ్యకీర్తి 7219, జి.రవీంద్ర 7367, కె.మనోజ్‌కుమార్ 7929, పి.తారకరామ్ 12977 ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

● శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి



స్థానిక శ్రీచైతన్య విద్యార్థులు వివిధ కేటగిరీల్లో మంచి ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని ఏజీఎం టీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఇ.రోహిత్ 384ర్యాంకు, వై.లిఖిత్ 555, జి.యశ్వంత్‌సాయి 1024, ఎ.గణేష్‌కుమార్‌రాజు 1862, టి.పవిత్ర 3028, ఎ.సాయితేజ 3157, కేపీ మోక్షిత 3390, ఇ.లక్ష్మణ్ 3678, టి.వేణికాచౌదరి 3753, ఇ.కుమార్‌రెడ్డి 4929, పి.జిజ్ఞాస 7091, కె.జీవన్ కుమార్ 7400, కె.శిరీష 7536, పి.పుష్పాంజలి 9281, జి.దివ్యకీర్తి 9602వంటి ర్యాంకులతోపాటు మొత్తంగా 58మంది విద్యార్థులకు ఐఐటీసీట్లు సాధించే ర్యాంకులు వచ్చాయని వివరించారు. విద్యార్థులను ఏజీఎంతోపాటు డీన్‌లు కేఎల్వీ ప్రసాద్, రామమోహన్‌రావు, సంపత్‌కుమార్, భాస్కర్, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు అభినందించారు.

కేంద్ర క్యాబినెట్‌లో టీడీపీకి చోటు దక్కడం శుభపరిణామం

- ఆర్‌సీ మునికృష్ణ



సంబరాలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ

తిరుపతి (జీవకోన), జూన్ 9: ఎన్డీయే కూటమిలో ఏపీనుంచి టీడీపీ నాయకులకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కడం శుభపరిణామమని కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ అన్నారు. స్థానిక 35వ డివిజన్‌లో మునికృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్, జగ్గా, మణి నాయుడు, సెల్వం, వినయ్, జయచంద్ర, హేమంత్, పవన్, భాను, లోకేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో నేలకూలుతున్న చెట్లు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 9: గత కొన్ని రోజులుగా కురుస్తున్న గాలి వానకు ఎస్వీయూనివర్సిటీలోని కొన్ని భారీ వృక్షాలు నేలకూలుతున్నాయి. తిరుపతి - చంద్రగిరి ప్రధాన మార్గంతో పాటు యూనివర్సిటీలోని పలు చోట్ల చెట్లు నేల కూలాయి. సంబంధిత సిబ్బంది ఆదివారం వీటిని తొలగించారు.

డాక్టరేట్ ప్రదానం



వరప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 9: ఎస్వీయూనివర్సిటీ ఎకనమిక్స్ పరిశోధకులు కె.వరప్రసాద్ డాక్టరేట్ పొందారు. ఫైనాన్సింగ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాక్టీస్ ప్రాబ్లెమ్స్ అండ్ ఇన్నోవేటివ్ స్ట్రాటజీస్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ మేడసాని దేవరాజులు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు వర్సిటీ సీఈ దామ్లానాయక్ తెలిపారు. వరప్రసాద్ రాష్ట్ర సచివాలయంలోని ఆర్థికశాఖ సెక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

చంద్రబాబుకు శుభాకాంక్షలు



తిరుపతి అర్బన్, జూన్ 9: కేంద్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా జనసేన నాయకులు ఆరణి శివకుమార్ ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేంద్రమంత్రిగా ప్రమాణం చేసిన రామ్మోహన్ నాయుడుకు అభినందనలు తెలిపారు.

మహిళా వర్సిటీ వీసీకి సాంబయ్య స్మారక పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 9: పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి గుంటూరుకు చెందిన సాంబయ్య స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 11వ తేదీన గుంటూరులో నిర్వహించే కార్యక్రమంలో సాంబయ్య స్మారక పరిషత్ ఈ పురస్కారాన్ని ఆమెకు అందించనున్నట్టు ఆ పరిషత్ అధ్యక్షుడు భాస్కరరావు తెలిపారు. వీసీని పలువురు అభినందించారు.

నగరవనానికి జంగిల్ రైడర్ వాహనం



మంగళం, జూన్ 9: కపిలతీర్థానికి సమీపంలో గల నగరవనానికి అటవీశాఖ అధికారులు కొత్తగా జంగిల్‌రైడర్ వాహనాలను తెప్పించారు. సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు నాలుగు జంగిల్ రైడర్ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలు బ్యాటరీ సాయంతో నడుస్తాయి. ఎత్తు పల్లాలు, రాళ్లతో కూడుకున్న దారుల్లో సులువుగా ప్రయాణం చేయవచ్చు. సందర్శకులు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న నగరవనంలో జంగిల్‌రైడర్‌ను నడుపుతూ తిలకించడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నగరవనాన్ని సందర్శకుల కోసం మరింత అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో జంగిల్ రైడర్ వాహనం ధర రూ.2.75 లక్షలు ఉందని అధికారులు తెలిపారు. త్వరలోనే సందర్శకులకు అందుబాటులోకి తెచ్చి, దీనికి అయ్యే రుసుమును నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

రోడ్డుపై పొంగుతున్న మురుగు



దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

తిరుపతి(గాంధీరోడ్డు), జూన్ 9: స్థానిక రామచంద్రానగర్‌లో(శ్రీవారిసన్నిధి పక్కవీధిలో)డ్రైనేజీ నీరు లీకై రోడ్డుపై ప్రవహిస్తుండటంతో దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో పాదచారులు, వాహన చోదకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి వర్షపునీటితో మురుగునీరు కలిసి రోడ్డంతా చిత్తడి.. చిత్తడిగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధిని పరిచయం చేస్తాం

సూళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తిరుమల, జూన్9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలకు శాంతి, అభివృద్ధిని పరిచయం చేస్తానని టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నెలవల విజయశ్రీ తెలిపారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్‌గా సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్న తనకు చంద్రబాబు ఎమ్మెల్యేగా అవకాశమిచ్చారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి గెలిపించారన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేస్తానన్నారు.

ధర్మారెడ్డికి కనువిప్పు కలగలేదు

'టీటీడీ ఈవో ధర్మారెడ్డికి దేవుడు పెద్ద శిక్షవేశాడు. అయినా ఆయనకు కనువిప్పు కలగలేదు' అని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఆగ్రహించారు. తాను గతంలో రెండుసార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసినా ఎన్నడూ ఇలాంటి నిరంకుశ అధికారిని చూడలేదన్నారు. ధర్మారెడ్డి స్వభావం మారాల్సి ఉందన్నారు. త్వరలో ఆయనే వెళ్లిపోవడమో, లేక తామే పంపడమో జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులకు అధికారి గౌరవమివ్వాలన్నారు. కాంగ్రెస్, టీడీపీకి చెందిన మాజీ నాయకులకే దర్శన అవకాశం కల్పించకుండా తప్పుడు నిర్ణయం తీసుకుని తమను వేధించారని ఆరోపించారు. గతంలో తాను దర్శనానికి సిఫార్సు లేక పంపితే టికెట్లు ఇచ్చేవారన్నారు. కానీ ధర్మారెడ్డి తన బాస్ జగన్మోహన్‌రెడ్డి తరహాలో నిరంకుశత్వంతో టీటీడీని భ్రష్టుపట్టించారన్నారు. తిరుమలకు పట్టిన శని ధర్మారెడ్డితో వదిలిపోవాలన్నారు. మంచి అధికారులను తీసుకువచ్చి టీటీడీలో పరిపాలన అందిస్తామన్నారు.



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం, విజయశ్రీ

కొత్త ప్రభుత్వం తక్షణం డీఎస్సీ ప్రకటించాలి

12వ పీఆర్సీ, దీర్ఘకాలిక బకాయిలు విడుదల చేయాలి : ఆపస్

తిరుపతి(విద్య), జూన్ 9: టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ డిమాండ్ చేశారు. ఆపస్ తిరుపతి జిల్లా శాఖ అభ్యాస వర్గ సమావేశం స్థానిక బైరాగిపట్టెడలోని సంఘ కార్యాలయం వెంకటకృప నిలయంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడబోతున్న కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టులకు మంగళం పలుకుతూ జారీ చేసిన జీఓ నెం 117ను తక్షణం రద్దు చేయాలని కోరారు. తద్వారా ఏర్పడిన ఖాళీలను కూడా వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను పరిష్కరించాలని కోరారు. పలు సమస్యలు పరిష్కరించాలని ప్రతిపాదనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు, రాష్ట్ర నాయకులు సుభాష్, దివాకర్, లత, సౌజన్య, దాము, మనోహర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శవన్నగారి బాలాజీ

తిరుమల ఘాట్‌లో కూలిన వృక్షం



తిరుమల, జూన్9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ భారీ వృక్షం కూలింది. తిరుమలలో ఆదివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. తిరుమలకు సమీపంలోని మూడవ మలుపు వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. అదృష్టవశాత్తూ ఆసమయంలో వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన నేపథ్యంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. వేగంగా చెట్లను కట్‌చేసి పక్కకు తొలగించారు. అనంతరం వాహనాలను ముందుకు పంపారు. గత వారంరోజులుగా వర్షం పలు సందర్భాల్లో కురిసిన నేపథ్యంలో ఘాట్‌రోడ్డులో తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రదేశాలు, చెట్లు కూలే ప్రాంతాల్లో నిఘా పెట్టారు.

టీటీడీ ఇంజనీరింగ్ టెండర్లలో భారీ కుంభకోణం

- నవీన్‌కుమార్‌రెడ్డి



తిరుపతి (జీవకోన), జూన్ 9: టీటీడీ ఇంజనీరింగ్ టెండర్లలో భారీ కుంభకోణం చోటుచేసుకుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీబీఐ అధికారులు వెంటనే రంగంలోకి దిగి టీటీడీ ఇంజనీరింగ్ ఫైల్స్‌ను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కంప్యూటర్ల నుంచి ఫైల్స్‌ను తొలగించే ప్రమాదం ఉందని ఉన్నతాధికారులకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. టీటీడీ ఈవో, ప్రధాన గణాంక అధికారి, చీఫ్ ఇంజనీర్, ఇంజనీరింగ్ టెక్నికల్ అడ్వైజర్లను సీబీఐ అధికారులు ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్‌చేశారు. శ్రీవారి సొమ్మును కాపాడే బాధ్యతను ఓ భక్తుడిగా, ఎన్డీయే కూటమి నాయకుడిగా తాను తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

అభాగ్యులకు అన్నదానం

తిరుపతి అర్బన్, జూన్ 9: పద్మావతిపురంలో ఉన్న పాస్ మనోవికాస్ కేంద్రంలోని 80మంది వృద్ధులు, మానసికరోగులు, దివ్యాంగులకు శని, ఆదివారం రోజుల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభిమాని సాని శ్రీనివాసుల రాయల్ అన్నదానం చేశారు. అలాగే రేణిగుంటలోని అభయక్షేత్రంలో దాదాపు 250మందికి అన్నదానం చేశారు.



రామోజీకి తిరుపతి జర్నలిస్టుల నివాళి



మౌనం పాటిస్తున్న జర్నలిస్టులు

తిరుపతి అర్బన్, జూన్ 9: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకు తిరుపతి జర్నలిస్టులు ఘన నివాళులర్పించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వారు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ స్థాయికి ఎదిగిన రామోజీ.. మీడియా రంగానికి ఓ పాఠంగా చరిత్రలో నిలిచిపోతారని శ్లాఘించారు. పత్రికా రంగానికి వయసు అడ్డురాదని, తుది శ్వాస వరకు పనిచేసి నిరూపించారన్నారు. ఆయన్ను మీడియా మొఘల్‌గా అభివర్ణించారు. అటువంటి వ్యక్తి మరణం పత్రికారంగానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, జర్నలిస్టులు రవికుమార్, ప్రసాద్‌రెడ్డి, ప్రకాష్‌నాయుడు, మన్నెం చంద్రశేఖర్ నాయుడు, గిరిబాబు, నేతాజీ, దామోదరనాయుడు, రాజు, రాజేంద్రప్రసాద్‌నాయుడు, శివరాంప్రసాద్, మునిరాజా, మురళి, దినేష్‌కుమార్, కోలా లక్ష్మీపతి, రమేష్‌స్వామి, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్, కరమల సురేంద్ర ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం కార్యాలయంలో...



తిరుపతి (జీవకోన): నగరంలో కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పురందర్ నాయుడు, గుర్రప్ప నాయుడు, రామచంద్ర నాయుడు, చక్రపాణి, చెన్నకేశవ నాయుడు, కిరణ్‌కాంతి చౌదరి, శ్రీమన్నారాయణ తదితరులుపాల్గొన్నారు.

జయశంకర్‌కు 'థాయ్‌లాండ్ ఫిజిక్స్' లైఫ్ మెంబర్‌షిప్

ఈ గౌరవం పొందిన తొలి భారతీయుడిగా గుర్తింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 9: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ విశ్రాంతాచార్యులు సీకే జయశంకర్ థాయ్‌లాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ లైఫ్ మెంబర్‌షిప్‌ను పొందారు. ఫిజిక్స్ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన బోధన, పరిశోధన, విస్తరణ కృషికి గుర్తింపుగా ఈ గుర్తింపు లభించింది. థాయ్‌లాండ్‌లో ఈ నెల 5 నుంచి 7వ తేదీ దాకా నిర్వహించిన ఫిజిక్స్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. థాయ్‌లాండ్‌లోని రాజాభట్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ జక్రాపాంగ్ కైవ్ ఖావో, థాయ్‌లాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ ప్రతినిధి ప్రొఫెసర్ విసాను పెచరపా ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రొఫెసర్ జయశంకర్‌కు అందజేశారు. థాయ్‌లాండ్ ఫిజిక్స్ అసోసియేషన్‌లో లైఫ్ మెంబర్‌షిప్ పొందిన తొలి భారతీయుడిగా ఆయన గుర్తింపును సంతరించుకున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.



కందికుంట వెంకటప్రసాద్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

● జాతీయ చేనేత ఐక్యవేదిక

మంగళం, జూన్ 9: సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన కందికుంట వెంకటప్రసాద్‌కు మంత్రి పదవి ఇవ్వాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డి బాబు ఆదివారం ప్రకటనలో కోరారు. 80లక్షలు జనాభా ఉన్న చేనేత వర్గానికి ఒకే టిక్కెట్ ఇచ్చారన్నారు. వెంకటప్రసాద్‌కు మంత్రి పదవి ఇస్తే చేనేతల అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఈ విషయంపై చంద్రబాబు, లోకేశ్ ఆలోచించి చేనేత వర్గానికి న్యాయం చేయాలన్నారు.



టీడీపీ అధికారంలోకి రావడం.. నారా లోకేశ్ భారీ మెజారిటీతో గెలవడంతో ఆదివారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకుడు కొల్లూరి ఇందుశేఖర్

ప్రజల ఆశీస్సులే గెలిపించాయి: పాశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూన్ 9: ఈ ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు, దేవుడి కృప తనను గెలిపించాయని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక హోసన్న ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న పాశం భావోద్వేగానికి లోనయ్యారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పేదలకు సంక్షేమ పథకాలను అం దిం చడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాన న్నారు. ఐదేళ్లు అధికారంలో లేకపోయినా స్థానికంగా అందరికీ అందుబా టులో ఉంటూ టీడీపీ బలోపేతానికి కృషి చేశానన్నారు. దీని ఫలితమే ఈ ఎన్నికల్లో ప్రజలందరూ తనకు మద్దతుగా నిలిచి గెలిపిం చారన్నారు. పేదలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీరుస్తానన్నారు. కార్యక్రమంలో పాశం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎమ్మెల్యే పాశంను సన్మానించి అభినందనలు తెలిపారు.

చిల్లకూరు: ఎమ్మెల్యేగా విజయం సాధించిన పాశం సునీల్‌కుమార్‌ను గూడూరులోని ఆయన నివాసంలో చిల్లకూరు మండలం జడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, కోటేశ్వరరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటతేజ

పెళ్లకూరు, జూన్ 9: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలో టీడీపీ సీనియర్ నేతలు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన నాయుడితో కలసి టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు పేరం వెంకటతేజ, సందీప్ తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సా ధించడంతో పాటు మంగళగిరి నియో జకవర్గంలో భారీ మెజార్టీ సాధించిన లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ వారితో మాట్లాడుతూ... ఎన్నారైల సహకారం ఎన్నటికీ మరువలేనిదన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట, జూన్ 9: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ మేరకు మొదటిసారిగా ఆదివారం ఉదయం మాజీ ఎంపీ నెలవల సుబ్ర హ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతియుతంగా పరిపాలన కొనసాగాలని వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు.

ధర్మారెడ్డికి కనువిప్పు కలగలేదు: నెలవల

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీ ఈవో ధర్మారెడ్డికి దేవుడు పెద్ద శిక్షవేశాడు. అయినా ఆయనకు కనువిప్పు కలగలేదు' అని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆగ్రహించారు. శ్రీవారి దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాను రెండుసార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసినా ఎన్నడూ ఇలాంటి నిరంకుశ అధికారిని చూడలేదన్నారు. మాజీ నేతలకు దర్శన అవకాశం కల్పించకుండా వేధించారని ఆరోపించారు. ధర్మారెడ్డి తన బాస్ జగన్ తరహాలో నిరంకుశత్వంతో టీటీడీని భ్రష్టుపట్టించారన్నారు. తిరుమలకు పట్టిన శని ధర్మారెడ్డితో వదిలిపోవాలన్నారు. మంచి అధికారులను తీసుకొచ్చి టీటీడీలో పరిపాలన అందిస్తామన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సత్కారం



పెళ్లకూరు, జూన్ 9: సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీని టీడీపీ మం డల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలు వాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సన్మానించారు. కె.ఉదయ్‌నాయుడు, నరేంద్రనాయుడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. పెళ్లకూరు టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యంను సన్మానించనున్నారు.

రేపు సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, జూన్ 9: సూళ్లూరుపేట మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈనెల 11న మంగళవారం గాండ్లవీధిలోని శ్రీ స్వశక్తి భవనంలో మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని కమిషనర్ చెల్లు గంగాప్రసాద్ తెలిపారు. వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులతో పాటు అధికారులందరూ హాజరుకావాలని పేర్కొన్నారు.

కురుగొండ్ల విజయంపై మొక్కులు చెల్లించుకొంటున్న టీడీపీ నేతలు

డక్కిలి, జూన్ 9 : వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ ఘనవిజయం సాధిస్తే గ్రామ దేవత ఎల్లమ్మకు 101 టెంకాయిలు కొడతామని మొక్కుకున్న వెలికల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఆ మొక్కు తీర్చారు. జి.చంద్రశేఖరరెడ్డి, పరంధామరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కె.సుధాకరరెడ్డి తదితరులు ఉన్నారు.

జేఈఈ ఫలితాల్లో గూడూరు విద్యార్థి ప్రతిభ



దివ్యపూర్ణచంద్

గూడూరు, జూన్ 9: జేఈఈ అడ్వాన్సుడు పరీక్షా ఫలితాల్లో గూడూరుకు చెందిన పేటేటి నాగ కోటేశ్వరరావు, స్వాతి కుమారుడు దివ్యపూర్ణచంద్ ఆల్ ఇండియా 98వ ర్యాంకు(ఈడబ్ల్యూఎస్) సాధించాడు. గూడురు పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి దివ్యపూర్ణచంద్ విజయవాడలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. జేఈఈ అడ్వాన్సుడ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆల్‌ఇండియా స్థాయి 98వ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. దీంతో విద్యార్థి దివ్యపూర్ణచంద్‌కు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

గూడూరు, జూన్ 9: మండలంలోని పోటుపాళెంలో ఆదివారం విద్యుదాఘాతంతో గొర్రె మృతి చెందింది. గ్రామానికి చెందిన నరేష్ గొర్రెలను మేతకు తీసుకువెళ్లాడు. మేస్తున్న సమ యంలో విద్యుత్ తీగ తెగి గొర్రెపై పడడంతో విద్యుదాఘాతానికి గురైన గొర్రె మృతి చెందింది. సుమారు రూ.10 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

డక్కిలి, జూన్ 9 : మెట్ట ప్రాంత రైతుల కలల ప్రాజెక్టు ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణంపై కొత్తప్రభుత్వం ఏర్పడడంతో రైతులు కోటి ఆశలతో ఉన్నారు. వాస్తవానికి గత టీడీపీ హయాంలో రూ.400 కోట్లతో ఈ రిజర్వాయరు నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేయించడంలో అప్పటి ఎమ్మెల్యే రామకృష్ణ ఎంతో కృషి చేశారు. పనులు కూడా 20 శాతం మేర పూర్తయ్యాయి. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రీ టెండర్ల పేరుతో రిజర్వాయరు పనులును అర్ధంతరంగా నిలిపివేసింది. తర్వాత 26 శాతం లెస్‌తో రీ టెండరులో పనులు దక్కించుకున్న కాంట్రాక్టరును కొంతమంది వైసీపీ నాయకులు పనులు ముందుకు సాగనీయకుండా అడ్డుకోవడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతూ వచ్చింది. నిర్మాణానికి అవసరమైన మట్టిని డక్కిలి మండలం పలుగోడు, మోపూరు, బీముడు చెరువుల నుంచి తరలించేందుకు కాంట్రాక్టరు అనుమతులు పొందినా అక్కడి రైతులు అడ్డుకోవడంతో కష్టతరంగా మారింది. దీంతో రిజార్వాయరు నిర్మాణానికి అడుగడునా అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో కాంట్రాక్టరు నష్టాలు చవిచూడాల్సి వస్తుందని పనులను నిలిపివేశాడు. దీంతో గత నాలుగేళ్లుగా ఈ రిజర్వాయరు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

జగన్ హామీ ఇచ్చినా ముందుకు సాగని వైనం

ఎన్నికలకు సుమారు ఏడాదికి ముందు నేతన్న నేస్తం బటన్ నొక్కేందుకు ముఖ్యమంత్రి హోదాలో వెంకటగిరికి వచ్చిన జగన్... ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రీ టెండర్లు పిలిచి రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు.

1.70 లక్షల ఎకరాలకు సాగునీరు

ఆల్తూరుపాడు నిర్మాణం పూర్తయయితే ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు, శ్రీకాళహస్తి పట్టణం, తిరుపతి నగరాలకు తాగు నీరు అందుతుంది. కానీ పాలకులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో మొదటి నుంచి నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

● ఇంకో రెండు రోజుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడనుండడంతో ప్రాజెక్టు నిర్మాణంపై కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వెంకటగిరికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే రిజర్వాయరు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈక్రమంలో ప్రాజెక్టు విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కురుగొండ్లను నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అర్ధంతరంగా ఆగిన ఆల్తూరుపాడు రిజర్వాయరు ఎత్తిపోతల పథకం

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



వెంకటగిరిలో జరిగిన హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి టౌన్/ సూళ్లూరుపేట, జూన్ 9: వెంకటగిరి పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానం నుంచి పెరుమాళ్ల స్వామి ఆలయం వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్ మాట్లాడుతూ... దేశంలో హిందువుగా పుట్టినందుకు గర్వించాలన్నారు. గతంలో హిందువులకు రక్షణ లేకుండా పోయిందని నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాక హిందువు సగర్వంగా చెప్పుకుంటుంటున్నారని అన్నారు. ర్యాలీలో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, సీఐ సంగమేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహకులు మల్లిఖార్జున్, నర్రారవి, గూడూరు వెంకటేశ్వర్లు, తదితరులు తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం బ్రాహ్మణ వీధిలో ఉన్న రామాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో మురళీరెడ్డి, కమ్మిరెడ్డి, కృష్ణా రెడ్డి, సుంకర ప్రతిమ, గోపి, ఉషా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని అంతర్గత రోడ్లు





అధ్వానంగా ఉన్న వీరారెడ్డిపల్లికి వెళ్లే అంతర్గత రోడ్డు - చిల్లకూరు మండలంలోని ఏరూరులో దారుణంగా ఉన్న రోడ్డు



దుస్థితిలో ఉన్న శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీకి వెళ్లే రోడ్డు

గూడూరు, జూన్ 9: నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో గుంతలమయమయ్యాయని గ్రామీణులు చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా లోకేశ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో దళిత, గిరిజన కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించారని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతర్గత రోడ్ల అభివృద్ధిని విస్మరించడంతో దారుణంగా మారాయంటున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారుల సైతం బురద రోడ్లలో నడక సాగించాలంటే ఇబ్బంది తప్పడంలేదంటున్నారు. గూడూరు పట్టణం నుంచి వీరారెడ్డిపల్లికి వెళ్లే మార్గం, సుందరయ్యకాలనీ, చవటపాళెం నుంచి దివిపాళెంకు వెళ్లే మార్గం, చెన్నూరులోని రామలింగయ్యకాలనీ, బీసీకాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిల్లకూరు మండలంలోని తొణుకుమాల, ఏరూరు, ఓడూరు, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. కోట మండలంలో శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, వెంకన్న పాళెం, జరుగుమల్లి, చెందోడు, వాకాడు మండలంలోని తిరుమూరు, దుగరాజపట్నం, చీమలపాడు, వాకాడు తదితర గ్రామాల్లో అంతర్గతరోడ్లు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించాలంటే అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని పలు దళితవాడలు, గిరిజన కాలనీలలో ఇవే పరిస్థితులు నెలకొన్నాయని, అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ మద్దతుతోనే అండమాన్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయం

డక్కిలి, జూన్ 9: సార్వత్రిక ఎన్నికల్లో అండమాన్ నికోబార్ దీవుల్లో టీడీపీ మద్దతుతోనే అక్కడి బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయం సాధించారని టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు చెప్పారు. ఆదివారం ఆయన ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం వైభవోపేతంగా జరిగిందని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయం

నాయుడుపేట టౌన్, జూన్ 9: అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాంధీమందిరం సెంటర్ వద్ద ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు డి.రాజేంద్ర, సుజాతమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఏ ప్రాంతంలో అయినా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాజేష్, 786 రఫి, జి.సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, కన్నెమ్మ, సంపూర్ణమ్మ, కోటిరెడ్డి, జిలక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

గుర్రప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



డక్కిలి, జూన్ 9: మండలంలోని తిమ్మాయపాళెం సమీపంలోని గుర్రప్ప స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం భక్తులు ఈ ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొంటారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకుడు భాస్కర్ తెలిపారు.

కోటమ్మకు పూజలు



కోట, జూన్ 9 : గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాహుల్‌తోనే కాంగ్రెస్‌కు పూర్వవైభవం

గూడూరు అర్బన్, జూన్ 9: రాహుల్ గాంధీతోనే కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం సాధ్యమవుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, నాయకుడు వేమయ్య అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ లోకసభలో కాంగ్రెస్‌పార్టీ పక్షనేతగా రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికకావడం సంతోషించదగ్గ విషయమన్నారు. దేశాభివృధి, నిరుద్యోగ యువత, ధరల స్థిరీకరణ కోసం అధికారపక్షంతో పోరాటం చేయగల సమర్థత రాహుల్‌కు ఉందన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



గూడూరులో బీజేపీ నాయకుల సంబరాలు

గూడూరు అర్బన్, జూన్ 9: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ పట్టణాధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు అన్నారు. ఆదివారం మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టవర్‌క్లాక్ కేంద్రం వద్ద స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో అన్నదానం నిర్వహించారు. పి.పురుషోత్తమరెడ్డి, దయాకర్, ఇంద్రవర్ధన్, ప్రకాశ్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: దేశ ప్రధానిగా మూడో సారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం చిట్టమూరులోని కొత్తగుంట కూడలిలో కూటమి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండల కన్వీనర్ దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. శరత్‌చంద్రారెడ్డి కేక్ కట్ చేసి టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడికి తినిపించారు. బీజేపీ, టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నృత్య విద్యార్థినుల ప్రతిభ



గూడూరు, జూన్ 9: ఒడిశా రాష్ట్రంలోని పురి నగరంలో ఆదివారం జరిగిన జగన్నాథ నృత్యోత్సవంలో గూడూరుకు చెందిన శివలలిత భరత నాట్య కళాక్షేత్రం కళాకారులు ప్రతిభ చాటారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు మల్లికా, వెంకయ్య మాట్లాడుతూ... పురి నగర్‌లోని అన్నపూర్ణా రంగమాన్‌చా ఆడిటోరియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కళాకారులు హజరయ్యారన్నారు. తమ కళాక్షేత్రానికి చెందిన కళాకారులు ప్రతిభ చాటడంతో అకాడమీ అధ్యక్షుడు లలితారావు చేతుల మీదుగా జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకున్నారన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 9: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం



వెంకటగిరి టౌన్, జూన్ 9: పట్టణంలో గత రెండు రోజులుగా వర్షం పడడంతో వాతావరణం చల్లబ డింది. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా వర్షం పడింది. దీంతో చెరువుల్లో కూడా కాస్త నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా వర్షలు పడుతున్నాయని ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారు.

కోటలో కుండపోత వర్షం

కోట: మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. 40 నిమిషాల పాటు ఈదురుగాలులు, బీభత్సం సృష్టించాయి. మండలంలోని కోట, విద్యానగర్, నెల్లూరుపల్లి, తిన్నెలపూడి, గూడలి, తదితర గ్రామాల్లో పెను గాలులు వీచాయి.

ఆగిన ఇసుక విక్రయాలు



నేతాజీనగర్ వద్ద డిపోలో నిల్వ ఉన్న ఇసుక

దొరవారిసత్రం, జూన్ 9: మండలంలోని నేతాజీనగర్ వద్ద ఉన్న ఇసుక డిపో లో విక్రయాలు ఆగాయి. రెండు రోజుల నుంచి విక్రయించడం లేదు. తిరుపతి గనుల శాఖ అధికారులు వచ్చి డిపో నుంచి విక్రయాలు చేయరాదని ఆదేశించడంతో గుత్తేదారులు వాహనాలు తీసుకుని వెళ్లిపోయారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇసుకను ఎవ్వరు తరలించకుండా రెవెన్యూ శాఖ అధికారులు సిబ్బందిని కాపలా పెట్టారు. కోడ్ సమయంలో కూడ వాకాడు స్వర్ణముఖి నది నుండి ఇక్కడికి ఇసుకను తీసుకు వచ్చి నిల్వ ఉంచారు. అలాగే ఓ వైపు ఇసుకను విక్రయించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం మారడంతో భారీగా నిల్వ చేసిన గుత్తేదారుడికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. రాత్రికిరాత్రి ఇసుకను తరలించే ఏర్పాట్లు చేపట్టగా గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు జిల్లా అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో జిల్లా గనుల శాఖ అధికారులు గుత్తేదారులను ఇసుక డిపో నుంచి ఖాళీ చేయించారు. ఇసుక విక్రయాలను అడ్డుకున్నారు.

కారు ఢీ కొని ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 9: పట్టణానికి సమీపంలోని తుమ్మూరు సమీపంలో కారు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శేషయ్య, నాగరాజు మేనకూరు సెజ్‌లోని ఓ కంపెనీలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తుమ్మూరు వద్ద బస్సులను నిలిపి రోడ్డు పక్కన వస్తుండగా కారు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శేషయ్య, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యానికి నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి కాచి బెదిరించి బైక్‌తో పరారీ

తడ, జూన్ 9: పరిశ్రమలకు విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరిన ఇద్దరిని బెదిరించి వాహనంతో పరారయ్యారు. వరదయపాళ్యం మండలం పులియాలం గ్రామానికి చెందిన ఎం.పరంధాం, రవి అపాచీ పరిశ్రమలో పని చేస్తుంటారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బైక్‌పై ఎన్‌ఎంకండ్రిగ మీదుగా బయలుదేరారు. మార్గమధ్యంలో మాంబట్టు సెజ్‌లో దట్టమైన చెట్లు ఉన్న ప్రదేశానికి వచ్చేసరికి అక్కడ ముగ్గురు వ్యక్తులు రోడ్డుపై అడ్డంగా నిలబడి బైక్‌ను ఆపారు. బైక్ నడుపుతున్న ఇద్దరిని బెదిరించి వారి వాహనంతో పరారయ్యారు. దీంతో బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం: నెలవల



నాయుడుపేట, జూన్ 9: నిరుద్యోగ యువత ఉపాధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఈ లోగా నిరుద్యోగ భృతి అందిస్తుందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేటలో ఆదివారం నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిని తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు జి.రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు. గత ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసి, సచివాలయ ఉద్యోగాలతోనే సరిపెట్టిందని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు ఉపాధి అవకాశాలను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని నెలవల భరోసా ఇచ్చారు.భాస్కర్‌రెడ్డి, ఎం.సూరి, వెంకటేశ్వర్లురెడ్డి, నానాబాల సుబ్బారావు, బి.నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు

చిల్లకూరు, జూన్ 9: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి పత్రిక, సినీరంగాలతోపాటు తెలుగుజాతికి తీరని లోటని టీడీపీ నాయకుడు, పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ అన్నారు. ఆదివారం జ్యోతి వేబ్రిడ్జి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు అనేక సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందిని ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, ఎం.కుమార్‌యాదవ్, శ్రీనివాసులు నివాళి అర్పించారు.

అభివృద్ధి వైపు పరుగులు



చిట్టమూరు, జూన్ 9: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందే రాష్ట్రం అభివృద్ధి వైపు రాష్ట్రం పరుగులు పెడుతోందని టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు అన్నారు. ఆదివారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ అధినేత ఆదేశాల మేరకు... రాగద్వేషాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమం వైపు దృష్టి పెడతామన్నారు. గూడూరు టీడీపీ ఎమ్మెల్యేగా సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈనెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం సమయంలో చిట్టమూరులో విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

శ్రీకాళహస్తి, జూన్ 9: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో ఎస్వీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆలయం కంచుగడప వద్ద ఆయన తనిఖీలు చేపట్టారు. స్వామి అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న దళారులను ద్వారం వద్దే ఆపేయాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

పానగల్ గంగమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి, జూన్ 9: పానగల్ గంగమ్మ ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా సత్రవాడ ప్రవీణ్, గౌరవ సలహాదారులుగా ఆర్కాట్ ముత్తు, బుజ్జి మేస్త్రీ, జయదేవన్ గిరి, భాస్కర్‌గౌడ్, కమిటీ చైర్మన్‌గా వేలూరు గుణశేఖర్, వైస్ చైర్మన్‌గా జైకృష్ణ, కోశాధికారిగా మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బాలమురగన్, కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 11న జాతర చాటింపు, 18, 19 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు.

బొజ్జల రిషితారెడ్డి జన్మదిన వేడుకలు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 9: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని భరద్వాజతీర్థం సమీపంలో ఉన్న అంబలిస్వామి ఆలయంలో బొజ్జల బృందమ్మ పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్ధులయ్య, హరి, భీమాల మునికృష్ణ, మునిరాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రిషితారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, కంఠా రమేష్, కంఠారమేష్, కాసరం రమేష్, మిన్నల రవి తదితరుల పాల్గొన్నారు.

నీలాద్రి నిలయంవాసులకు అండగా ఉంటాం: టీడీపీ

ఏర్పేడు, జూన్ 9: ఏర్పేడు మండలం వికృతమాల వద్ద టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నీలాద్రి నిలయంలో నివాసం ఉంటున్న కుటుంబాలకు రక్షణగా కల్పిస్తామని టీడీపీ నాయకులు చెప్పారు. వికృతమాల గ్రామానికి చెందిన టీడీపీ నేత హేమాక్షి రాయల్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం నీలాద్రి నిలయం కాలనీకి చేరుకుని మహిళలకు ధైర్యం చెప్పారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మునిరత్నం, రామచంద్రయ్య, మురళిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గిరి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

శ్రీకాళహస్తి, జూన్ 9: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో మురుగునీరు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఖాళీ స్థలాల కారణంగా దోమలు, పందుల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందించిన పురపాలక సంఘక కమిషనర్ రమేష్‌బాబు ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో దుర్గంధంతో నిండిన స్థలాలను శుభ్రం చేయించారు. ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరింపజేసిన బొజ్జల సుధీర్‌రెడ్డికి, కమిషనర్ రమేష్‌బాబుకు, సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లిన మల్లీశ్వరికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

డాక్యుమెంట్ రైటర్లదే హవా

రేణిగుంట, జూన్ 9: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల హవా సాగుతోంది. స్టాంపు డ్యూటీ నిధులు దుర్వినియోగం చేశారన్న కారణంగా సబ్ రిజిస్ట్రార్ శోభారాణిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సస్పెన్షన్ వెనుక అసలు సూత్రధారులు డాక్యుమెంట్ రైటర్లే అని సమాచారం. వైసీపీ ప్రభుత్వ పాలనలో రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు జరిగాయని, భూములను రిజిస్ట్రేషన్ చేయాలంటే వివిధ సర్టిఫికెట్లు కావాలంటూ క్రయవిక్రయాలపై మెళికలు పెట్టేవారని, ఈ క్రమంలో సబ్ రిజిస్ట్రార్‌కు ఇవ్వాలంటూ అంకణానికి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు చాలా కాలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా బ్లాక్ మనీ కావడంతో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు ఆదాయ పన్ను చెల్లించకుండా కోట్లలో ఆస్తులు కూడపెట్టారని సమాచారం. ఇదిలా ఉండగా గత ఐదేళ్ల కాలంలో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలపై పలు మార్లు ఫిర్యాదులు అందినా ఒక్కసారి కూడా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించకపోవడం గమనార్హం.

నన్ను ఓడిస్తే దోచుకోవచ్చనుకున్నారు: ఆదిమూలం

వరదయ్యపాళెం, జూన్ 9: సత్యవేడు నియోజకవర్గంలో వనరులను దోచుకోవడానికే తనను ఓడించాలని ప్రయత్నించారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. వరదయ్యపాళెంలో ఆదివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వనరులను మంత్రి పెద్దిరెడ్డి ఎలా దోపిడీ చేస్తున్నారో జగన్‌కు వివరించానని తెలిపారు. అందుకే తనకు వైసీపీ టిక్కెట్టు ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పరిస్థితి వివరించగా తనకు పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. తన విజయం కోసం కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నిర్మల్, కరుణాకర నాయుడు, జయశంకర్‌రెడ్డి, మునిభూషణమ్మ, కడివేటి రమేష్, అజయ్, దశరదయ్య, రమణయ్య, శ్రీను, చిరంజీవి, తులసిన కుమార్, డిల్లీ ప్రకాష్, పురుషోత్తం, మహేశ్వరి, హరిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం

బుచ్చినాయుడుకండ్రిగ: తన గెలుపునకు కృషిచేసిన ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం ఇస్తామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బీఎన్‌కండ్రిగలో ఆదివారం ఎమ్మెల్యే అభినందన సభ టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అవినీతిని బయట పెట్టినందుకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు డబ్బులు ఇచ్చి తన గెలుపును అడ్డుకోవాలని ప్రయత్నించారని విమర్శించారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అణుగుణంగా పనిచేస్తామని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కన్నయ్య నాయుడు, సుధాకర్ నాయుడు, రమేష్ నాయుడు, సుందరయ్య, దశరద ఆచారి, వీరరాఘవులు, ముధునాయుడు, శశియాదవ్, రవినాయుడు, శేఖర్ నాయుడు, మునిచంద్రరెడ్డి, మునిసుబ్బయ్య, రమేష్‌బాబు, చెంచురామ నాయుడు, భూపయ్య, శ్రీనివాసులు, మునిరాజా పెంచిలయ్య, భాస్కర్ యాదవ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

కేవీబీపురం: మండలంలోని టీడీపీ నాయకులు కోనేటి ఆదిమూలాన్ని సన్మానించారు. రామాంజులునాయుడు, గోపీనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, జయరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, మునస్వామియాదవ్, వరలక్ష్మి, మునిలక్ష్మి, నాగరాజునాయుడు, కిషోర్‌రెడ్డి, కేశవులునాయుడు, బాలాజీ, మణి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించండి



నిర్మాణం పూర్తైనా ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

తారకరామనగర్, జూన్ 9: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ క్లస్టర్-3లో నిర్మాణం పూర్తైన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభానికి నోచుకోవడంలేదు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో ఏర్పాటైన తారకరామనగర్‌లో అధికశాతం పేదలే నివసిస్తున్నారు. అక్కడ ఎటువంటి ప్రభుత్వాస్పత్రి లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న ఆరోగ్య సమస్య ఎదురైతేనా తిరుపతి, రేణిగుంటకు వెళ్లాల్సిందే. మండల కేంద్రమైన రేణిగుంటకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేదు. తారకరామనగర్ నుంచి ఆటోలో కరకంబాడి వెళ్లి, అక్కడి నుంచి మరో ఆటోలో రేణిగుంటకు చేరుకోవాల్సిన పరిస్థితి. అలాగే తిరుపతికి కూడా బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. అత్యవసర చికిత్స అవసరమైతే ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సిందే. ఈ నేపథ్యంలో స్థానికులకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2020 జనవరిలో రూ.15.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం చేపట్టారు. నత్తనడకన సాగిన ఆ భవన నిర్మాణం ఎట్టకేలకు ఏడాది క్రితం పూర్తయింది. అయితే ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం

కరకంబాడి క్లస్టర్-3 తారకరామనగర్‌లో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలతో 2020 జనవరి 6న శంకుస్థాపన చేశారు. అయితే భవన నిర్మాణం నేటికీ అసంపూర్తిగానే ఉంది. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

గాలివాన

శ్రీకాళహస్తి, జూన్ 9: శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం సాయంత్రం సుమారు గంటపాటు గాలితో కూడిన వర్షం పడింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈదురుగాలులతో పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఓ చెట్టు కూలిపోయింది. అరగంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

దుప్పట్ల పంపిణీ

రేణిగుంట, జూన్ 9: రేణిగుంట మండలం ఎస్ఎస్‌కండ్రిగ గ్రామంలో ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు జులియన్, ఆకాంక్ష సంస్థ కార్యదర్శి డాక్టర్ రవిబాబు, సంస్థ సభ్యులు మునీంద్ర, శ్రీధర్, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని గోవిందవరం ఎస్టీకాలనీలో గిరిజనులకు రేణిగుంటలోని చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాగ్యమ్మ, బాబునాయుడు, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన స్థలాన్ని కాపాడండి

ఏర్పేడు, జూన్ 9: మర్రిమంద పంచాయతీలో కమ్యూనిటీ భవనం కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం వారు సదరు స్థలం వద్ద నిరసన తెలిపారు. వికృతమాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 132, 133లో 70 సెంట్ల భూమిని 20ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం మర్రిమంద పంచాయతీకి కేటాయించిందన్నారు. ఈ స్థలాన్ని వైసీపీ నేతలు కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. తహసీల్దారు శివప్రసాద్‌కు వినతిపత్రం అందించినా పట్టించుకోలేదని వాపోయారు. టీడీపీ ప్రభుత్వంలో అయినా కమ్యూనిటీ భవన స్థలాన్ని కాపాడాలని సీపీఎం నాయకులు కోరారు. కార్యక్రమంలో రంగయ్య, కరీముల్లా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

సత్యవేడు, జూన్ 9: ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవ సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సత్యవేడులో బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, మురళి, శివకుమార్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కల్కి ఆక్రమిత భూములను ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారు?

వరదయ్యపాళెం, జూన్ 9: వరదయ్యపాళెం మండలం బత్తులవల్లం హరిజనవాడలో కల్కి ఆక్రమించుకున్న పేదలకు చెందిన 3.74 ఎకరాల భూములను అధికారులు ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారని ఏపీ హేతువాదసంఘ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల క్రితం బత్తులవల్లం గ్రామంలో పేదలకు చెందిన 3.74 ఎకరాల భూమిని కల్కి అనే బాబా ఆక్రమించి రూ.500 కోట్లతో ఆశ్రమం నిర్మించాడన్నారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ యేడాది జనవరి 10న న్యాయస్థానం రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. భూములను పేదల స్వాధీనం చేయాల్సిన బాధ్యత కలెక్టర్, వరదయ్యపాళెం తహసీల్దారుపై ఉందన్నారు. అయితే వారు ఇంత వరకు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి పేదల భూములను స్వాధీనం చేయడంతో పాటు 16 సంవత్సరాల నుంచి పంట నష్టానికి ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.60లక్షలు కల్కి నుంచి వసూలు చేసి రైతులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తామని హెచ్చరించారు.

నవరత్నాల నిలయం పాక్షిక ధ్వంసం

శ్రీకాళహస్తి, జూన్ 9: పట్టణ శివారులోని నవరత్నాల నిలయంలోని బొమ్మలను గుర్తుతెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ముందస్తు జాగ్రత్తగా మూడురోజుల క్రితం పురపాలక సంఘ అధికారులు నవరత్నాల నిలయం లోపల గదిలోని చిత్రపటాలు, అద్దాలతో రూపొందించిన పలు బొమ్మలను భద్రపరిచారు. అయితే శనివారం రాత్రి నవరత్నాల నిలయంలోకి కొందరు గుర్తు తెలయని వ్యక్తులు ప్రవేశించారు. ప్రాంగణంలో ఉన్న రైతు నమూనా, మహిళ ప్రతిమలు, మాజీ సీఎం జగన్ బొమ్మతో ఉన్న శిలాఫలకం ధ్వంసం చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ఎంజీఎం విద్యార్థి ప్రతిభ

శ్రీకాళహస్తి, జూన్ 9: పట్టణంలోని ఎంజీఎం జూనియర్ కళాశాలకు చెందిన ఎ.వినయ్ జేఈఈ పరీక్షల్లో ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయి జనరల్ క్యాటగిరీలో 12,159 ర్యాంక్, ఓబీసీ క్యాటగిరీలో 2,789 ర్యాంకు సాధించాడు. ఆదివారం వినయ్‌ను ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం పాల్గొన్నారు

కుంభాభిషేకానికి సర్వం సిద్ధం

పిచ్చాటూరు, జూన్ 9: పిచ్చాటూరు మండలం రాజానగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయక, బాలాంబిక, పాల మునీశ్వరులు, ఉగ్రరూప మునీశ్వరుల ఆలయ మహా కుంభాభిషేకం ఈనెల 10నుంచి 13 తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సిద్ధి వినాయక ఆలయ మండలాభిషేకం

పిచ్చాటూరు, జూన్ 9: పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామంలో సిద్ధి వినాయక స్వామి ఆలయ మండలాభిషేకం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

ఆక్రమణదారుల నుంచి శ్మశాన స్థలాన్ని విడిపించండి

శ్రీకాళహస్తి, జూన్ 9: నుంచి క్రైస్తవుల స్మశాన స్థలాన్ని ఆక్రమణదారుల విడిపించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి క్రైస్తవ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సైమన్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బసవయ్యపాళెంలో సర్వే నెంబరు 12-24లో సుమారు 5 ఎకరాలు 18 సంవత్సరాల క్రితం క్రైస్తవుల స్మశానానికి కేటాయించారన్నారు. గత ప్రభుత్వం పెద్దల సహకారంలో కొంత మంది భూకబ్జాదారులు ఎకరా స్థలాన్ని ఆక్రమించి గోడ కట్టారని ఆరోపించారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సాయం చేయకపోగా ఉన్న స్థలంలో మరికొంత ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. బొజ్జల సుధీర్‌రెడ్డి స్థలాన్ని తమకు స్వాధీనం చేయాలని కోరారు.

పుత్తూరు వార్తలు

దేశ ప్రజల ఆకాంక్ష మోదీ



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూన్ 9: దేశ ప్రజలందరి ఆకాంక్ష ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ నగరి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కేఎన్ హరిబాబు అన్నారు. ఆదివారం ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీకి మూడవసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో ఎన్‌డీఏ కూటమి రికార్డు మెజార్టీతో అధికారం కైవసం చేసుకోవడం, నగరి నుంచి గాలి భానుప్రకాష్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలవడం వైసీపీ అరాచక పాలన పట్ల ప్రజలు ఎంత స్థాయిలో విసిగిపోయి ఉన్నారో తెలియజేస్తోందన్నారు. అలాగే పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, మునస్వామి, గణేష్, హరి, ప్రకాష్, కిషోర్, గోపి, భక్తవత్సలం తదితరలు పాల్గొన్నారు.

ఎంవీ యాక్ట్ సవరణను రద్దు చేయాలి: సీఐటీయూ

పుత్తూరు టౌన్, జూన్ 9: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ వెహికల్ యాక్ట్ సవరణను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం లారీ డ్రైవర్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో మోటార్ వెహికల్ చట్టాన్ని సవరించి డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం స్పందించి సవరించిన మోటార్ వెహికల్ చట్టాన్ని రద్దుచేసి డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, డ్రైవర్ల యూనియన్ నాయకులు ప్రశాంత్, కృష్ణయ్య, శివశంకర్ ప్రసాద్, మనోహర్, వేలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

వడమాలపేట, జూన్ 9: ఈనాడు గ్రూప్ అధినేత రామోజీరావు చిరస్మరణీయుడని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయులు అన్నారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటయ్య లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వరరావ్, డిల్లీప్రసాద్, జనార్దన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరుపై ముద్దుకృష్ణమది చెరగని ముద్ర



పుత్తూరులోని టీడీపీ కార్యాలయం వద్ద, తొరూరులో ముద్దుకృష్ణమకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూన్ 9: పుత్తూరుపై గాలి ముద్దుకృష్ణమనాయుడిది చెరగని ముద్రని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు అన్నారు. ఆదివారం ముద్దుకృష్ణమ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని కల్యాణపురం వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళలర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1983లో ఎమ్మెల్యేగా గెలిచిన తొలినాళ్లలోనే పుత్తూరుకు ఆర్టీసీ బస్టాండ్, డిగ్రీ కళాశాల, బాలికలకు ప్రత్యేకంగా జూనియర్ కళాశాల, ఫైర్ స్టేషన్, అటవీశాఖ, ఇరిగేషన్ శాఖ కార్యాలయాలను మంజూరు చేయించి అభివృద్ధికి నాంది పలికారని గుర్తు చేసుకున్నారు. ఐదు సార్లు పుత్తూరు ఎమ్మెల్యేగా, ఒకసారి నగరి ఎమ్మెల్యేగా ముద్దుకృష్ణమ చేసిన అభివృద్ధి ఇప్పటికీ పట్టణవాసుల కళ్లముందు ఉందన్నారు. పుత్తూరును పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించిన ఘనత ముద్దుకృష్ణమ చలవేనన్నారు. తండ్రి బాటలోనే భానుప్రకాష్ ప్రజాసేవ చేయనున్నారని వివరించారు. అలాగే మండల పరిధిలోని తొరూరులో ముద్దుకృష్ణమనాయుడికి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు, నగరి నియోజకవర్గాల నుంచి 8సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఆరు సార్లు గెలిచారంటే ఆయనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని తెలియజేస్తోందన్నారు. పుత్తూరు ఈ స్థాయిలో అభివృద్ధి సాధించిందంటే దానికి ముద్దుకృష్ణమ చేసిన అవిరాళ కృషే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. పుత్తూరు ప్రజల గుండెల్లో ముద్దుకృష్ణమకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట: మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధుల నివారణ



డాక్టర్ రవిరాజును సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పుత్తూరు, జూన్ 9: ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాధులను అదుపు చేసేందుకు ముందు జాగ్రత్తగా అవగాహనకు పెద్దపీట వేస్తారన్నారు. ఈ కోణంలోనే తాను ఆలోచించి కొవిడ్, ఆంత్రాక్స్, చికెన్‌గున్యా, డెంగ్యూ వ్యాధుల మీద తరచూ ప్రజలకు అవగాహన కల్పించానని వివరించారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశం వున్నందున అప్రమత్తంగా వుండాలని కోరారు. అనంతరం రవిరాజును సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షుడు కేఎల్ఎన్ మూర్తి, కార్యదర్శి మునికృష్ణయ్య, కోశాధికారి గుణశేఖర్‌రెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోకు సన్మానం

వడమాలపేట, జూన్ 9: వడమాలపేట వీఆర్వోగా పదవీ విరమణ పొందిన కుమార్‌రాజును చిత్తూరు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు సన్మానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

వడమాలపేట, జూన్ 9: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వద్ద అరవింద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. సుమారుగా 195 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 27 మంది ఉచితంగా ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు స్థానిక ప్రభుత్వాస్పత్రి సీహెచ్‌వో పురుషోత్తం రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు హిమజ, అసిస్టెంట్ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

పూలగెరిగ ఉత్సవం



వడమాలపేట, జూన్ 9: మండల పరిధిలోని ఎస్‌బీఆర్ పురంలో గంగ జాతర ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న జాతరలో మొదటిరోజు ఆదివారం పూల గెరిగ ఉత్సవాన్ని సర్పంచు మణిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం గెరగను ప్రత్యేకంగా పూజించి సుందరంగా అలంకరించారు. అనంతరం బ్యాండు వాయిద్యాల నడుమ పూల గెరిగను ఊరేగించగా గ్రామస్తులు కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచు రవి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.